మొక్కజొన్న సాగుకే మొగ్గు

● జూలై 15 వరకూ విత్తుకు అనుకూలం

మడకశిరరూరల్: మొక్కజొన్న పంట సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. గత ఏడాది ఖరీఫ్‌లో మొక్కజొన్న సాగు అన్నదాతకు అన్ని విధాలుగా కలిసొచ్చి మంచి దిగుబడులు సాధించి లాభాలు పొందారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ముందస్తు వర్షాలు పడటంతో ఈ ఏడాది కూడా మంచి దిగుబడి సాధించి లాభాలు పొందవచ్చని రైతులు పొలాలను సిద్ధం చేసుకున్నారు. మేలురకమైన విత్తనాలను కొనుగోలు చేసి యాజమాన్య పద్ధతులను పాటిస్తూ మొక్కజొన్న పంట సాగు చేస్తున్నారు. జూన్ ఆరంభం నుంచి జూలై 15 వరకూ మొక్కజొన్న పంటసాగుకు అనుకూలంగా ఉందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 150 ఎకరాలకు పైగా సాగు చేయగా ప్రసుతం చాలా మంది రైతులు మొక్కజొన్న విత్తనాలను సాళ్ల పద్ధతిలో విత్తుకుంటున్నారు. ఎక్కువ విస్తీర్ణంలో మొక్కజొన్న సాగయ్యే అవకాశం ఉందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పంటకు తెగుళ్ల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటూ, రైతులకు సూచనలు, సలహాలను అందిస్తామన్నారు.



మొక్కజొన్న విత్తనాలు విత్తుతున్న దృశ్యం

మొక్కజొన్న సాగుతో అధిక ఆదాయం



బోరు బావి కింద ఐదు ఎకరాల్లో మొక్కజొన్న పంటను యాజమాన్య పద్ధతులను పాటిస్తూ సాగు చేశాను. ఎకరాకు రూ.15 వేల ఖర్చు పెట్టి మేలురకమైన విత్తనాలను కొనుగోలు చేసి సాళ్ల పద్ధతిలో సాగు చేశాను. గత ఏడాది మొక్కజొన్న పంటలో మంచి దిగుబడి సాధించిన పంటకు మద్దతు ధర లభించడంతో ఆదాయం బాగా వచ్చింది. మూడేళ్ల నుంచి ఈ పంటను సాగు చేసి లాభాలు పొందాను.

– శ్రీరామరెడ్డి, రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం



మునగ పంటను పరిశీలిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: ప్రకృతి వ్యసాయం ద్వారా పంటల సాగు రైతుకు లాభదాయకంగా ఉంటుందని డివిజన్ ప్రకృతి వ్యవసాయం కో–ఆర్డినేటర్ రమేష్ తెలిపారు. శనివారం ఆయన ఆమిదాలగొంది పంచాయతీలో ప్రకృతి వ్యవసాయం ద్వారా సాగు చేసిన వివిధ రకాల పంటలు, రైతు రామాంజనేయులు సాగు చేసిన మునగ పంటతో పాటు అంతర్ పంటగా 10 రకాల పంటను పరిశీలించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం సాగు విధానం, భూసార పరీక్షలు, పంట మార్పిడి, జీవామృతం, బీజామృతం తయారీ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ ఆకస్మిక తనిఖీ



పుస్తకాలు పంపిణీ చేస్తున్న డిప్యూటీ డీఈఓ రంగస్వామి

అగళి: మండల కేంద్రంలోని విద్యశాఖ కార్యాలయంలో విద్యార్థులకు 2024–25 విద్య సంవత్సరానికి సంబంధించిన విద్యా సామగ్రిని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను డిప్యూటీ డీఈఓ రంగస్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇప్పటి వరకూ ఎన్ని పాత పుస్తకాలు వచ్చాయి? ఇంకా ఎన్ని రావాల్సి ఉన్నాయో ఎంఈఓ–2 చంద్రశేఖర్‌నాయుడును ఆరా తీశారు. డిప్యూటీ డీఈఓ మాట్లాడుతూ మండలంలోని 3,133 మంది విద్యార్థులకు సంబంధించి ఇప్పటి వరకూ పాఠ్యపుస్తకాలు 22,235, నోటు పుస్తకాలు 18,564, బెల్టులు 2189, వచ్చాయన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాల భవనం ప్రారంభం



రిబ్బన్ కట్ చేసి సంఘం భవనాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గోళ్లాపురం గ్రామంలో మహిళా సంఘాల భవనాన్ని ఆధునికంగా తీర్చిదిద్ది శనివారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ దేవరాజు, సూర్య కంపెనీ హెచ్ఆర్ శివప్రసాద్, మాజీ జెడ్పీటీసీ ఆదినారాయణ పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. సూర్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో భవనానికి బెడ్డింగ్ వేయించి, విద్యుత్ కనెక్షన్‌తో పాటు ఫుల్ వైరింగ్, గోడలకు ప్లాస్టింగ్, పెయింటింగ్ చేయించారు. అలాగే మహిళలకు రెండు మరుగుదొడ్లు నిర్మించారు. అనంతరం సూర్యఫౌండేషన్ సభ్యులను అభినందించి, సన్మానించారు. కార్యక్రమంలో వెలుగు సీసీ ఆదినారాయణ, వైస్ సర్పంచ్ శివకుమార్, చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ సునీత, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్, అధికారులు

పావగడ: ప్రజల సమస్యలు వెంటనే పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శి తులసి మద్దినేని అధికారులకు సూచించారు. పట్టణంలోని ఎస్ఎస్‌కే రంగ మందిరంలో శనివారం నిర్వహించిన జన స్పందన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ జన స్పందన కార్యక్రమం కేవలం వేదికకే పరిమితం కాకూడదని, ప్రజలు అందించిన అర్జీలకు పరిష్కారం లభిస్తేనే కార్యక్రమానికి సార్థకత లభిస్తుందన్నారు. కలెక్టర్ శుభ కళ్యాణ్ మాట్లాడుతూ జన స్పందన కార్యక్రమం పేరుకు మాత్రమే నిర్వహించకూడదు, అధికారులు ప్రజల సమస్యలకు స్పందించి పరిష్కరించిన నాడే జన స్పందన కార్యక్రమం అర్థవంతంగా ఉంటుందన్నారు. సబ్సిడీ విత్తన వేరుశనగను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎమ్మెల్యే హెచ్‌వీ వెంకటేశ్ మాట్లాడుతూ నాగలమడక అంత్య సుబ్రహ్మణ్యం స్వామి దేవాలయం జీర్ణోద్ధరణకు చర్యలు చేపట్టాలని జిల్లా ఇన్‌చార్జ్ కార్యదర్శిని కోరారు. పీడీలు గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోండి



మాట్లాడుతున్న డాక్టర్ హరీష్ కుమార్

హిందూపురం: కిరికెరలోని ఎల్ఆర్‌జీ పబ్లిక్ స్కూల్‌లో శనివారం పెట్టుబడి వేదిక కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరీష్ కుమార్ మాట్లాడుతూ..పిల్లలకు విద్య, ఆరోగ్యం అనే పెట్టుబడిని అందించే బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందన్నారు. తద్వారా విద్యార్థులు భావిపౌరులుగా ఎదుగుతారన్నారు. ప్రిన్సిపాల్ భారతి మాట్లాడుతూ.. పిల్లలకు ఒక్క చదువు మీద మాత్రమే శ్రద్ధ చూపకుండా నాయకత్వ లక్షణాలు పెంపొందించుకునేందుకు తల్లిదండ్రులు సహకారం అందించాలన్నారు. పిల్లల సామర్థ్యాల ఆధారంగా అన్ని రంగాల్లో ఎదుగుతారని చెప్పారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో స్కూల్ కార్యదర్శి బాలసుందరం తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చాలి

లేపాక్షి: మండలంలోని పులమతి పంచాయతీ పరిధిలో యున్న తిలక్‌నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం ఉదయం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు, 0–6 సంవత్సరాలు పిల్లల తల్లులతో సమావేశం నిర్వహించారు. పూర్వప్రాథమిక విద్య ప్రాముఖ్యతను ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయమ్మ అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ ద్వారా పిల్లల శారీరక, మానసిక, శాంగిక, మేథోశక్తి, అభివృద్ధిని వివరించారు. అంగన్‌వాడీ ముద్దు–కాన్వెంట్ వద్దు, అంగన్‌వాడీ విద్య–ఆటపాటల విద్య నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకులు, తల్లులు పాల్గొన్నారు.

హిందూపురం టౌన్: 6 ఏళ్లలోపు పిల్లలను అంగన్‌వాడీల్లో చేర్పించాలని కోరుతూ పట్టణంలోని సత్యసాయి నగర్ అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సిబ్బంది ర్యాలీ చేపట్టారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా పిల్లల తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ ద్వారా చేకూరే లబ్ధి, విద్యార్థులకు బోధించే తీరును వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీవల్లి, సల్మా, రామాంజనమ్మ, పిల్లల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



లేపాక్షి: ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

అంగన్‌వాడీ పిలుస్తోందిపై ర్యాలీ

అగళి: మండలంలోని నరసబుంది గ్రామంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లీలావతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు అంగన్‌వాడీ పిలుసోంది రా అనే కార్యక్రమంపై శనివారం ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ మూడేళ్లు నిండిన పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేయడంతోపాటు ఆహ్లాదకర వాతావణంలో ఆటాపాటలతో కూడిన విద్యను అందిస్తామన్నారు.

బడి ఈడు పిల్లలను చేర్పించాలి

పరిగి: బడి ఈడు పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలని ఎంఈఓ లక్ష్మీదేవి తెలిపారు. శనివారం మండల కేంద్రం పరిగిలో 'నేను బడికి పోతా' కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించారు. ఎంఈఓ లక్ష్మీదేవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ 6 నుంచి 14 ఏళ్ల వయసున్న పిల్లలంతా తప్పనిసరిగా బడిలో చేరాలని, విద్యాహక్కు చట్టం చెప్తోందన్నారు. గ్రామాల్లో తల్లిదండ్రుల సహకారంతో వారి పిల్లలను తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించుకోవాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు లక్ష్మీనరసింహ, ఏఓ అశ్వర్థప్ప, ఎంఈఓ–2 శేషాచలం, స్థానిక జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం సత్య కృపారాజు, కాంప్లెక్స్ పరిధిలోని ప్రధానోపాధ్యాయులు, ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ అసిస్టెంట్లు, సీఆర్పీలు, ఐఈఆర్పీలు, ఎమ్మార్సీ సిబ్బంది, అంగనవాడీ కేంద్రం కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రాడ్యుయేషన్ డే..

గోరంట్ల: మండలంలోని పుట్టగుండ్లపల్లిలో ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమం, గ్రాడ్యుయేషన్ డే ను శనివారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ పిలుస్తోంది రా కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ అధికారులు, పిల్లల తల్లిదండ్రులతో కలిసి ర్యాలీ చేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగరాణి, ఎంఎస్‌కే భారతి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు



అలంకరణలో ఆంజనేయ స్వామి

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో ఆంజనేయస్వామికి శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు కేశవ మూర్తి స్వామి వారికి సుప్రబాతసేవ, తైలాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు చేశారు. అనంతరం భక్తులు తెచ్చిన తమలపాకుతో ఆకు అలంకరణతో పాటు పూలతో ప్రత్యేకంగా అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. మండలం నుంచే కాక సమీప కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు.

లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో పూజలు



అలంకరణలో లక్ష్మీనరసింహస్వామి

రొళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శనివారం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. భక్తులు తీసుకువచ్చిన పట్టు వస్త్రాలు, వడి బియ్యంతో పాటు బంగారు ఆభరణాలతో పాటు పూలతో లక్ష్మీదేవి సమేతంగా వెండి కవచంతో నరసింహస్వామిని అర్చకులు విశేషంగా అలంకరణ చేసి మహామంగళారతి చేశారు. స్థానికులు, చుట్టు పక్కల గ్రామాలతో పాటు కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి దర్శించుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

హుండీ కానుకల లెక్కింపు



హుండీ కానుకలను లెక్కిస్తున్న అధికారులు

లేపాక్షి: స్థానిక వీరభద్రస్వామి దేవాలయంలో శనివారం ఉదయం శ్రీసత్యసాయి జిల్లా దేవదాయ శాఖ అధికారి బి.నరసింహరాజు పర్యవేక్షణలో హుండీకానుకలను లెక్కించారు. 105 రోజులకు సంబంధించిన హుండీ కానుకలను లెక్కించగా రూ.4,47,374 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈఓ నరసింహమూర్తి తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఆయల కమిటీ సభ్యులు, ఆలయ సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

క్షణికావేశంలో తప్పులు చేయొద్దు

హిందూపురం అర్బన్: క్షణికావేశంలో తప్పులు చేస్తే ఇలా జైలు పాలు కావాల్సి వస్తుంది. కుటుంబంలో.. సమాజంలో గౌరవ మర్యాదలు కోల్పోతారు. అదే కాస్త ఓర్పుతో ఉంటే కాలమే సమాధానం చెబుతుందని సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్ పేర్కొన్నారు. శనివారం హిందూపురం సబ్‌జైలును సందర్శించారు. ఏయే కేసుల్లో రావాల్సి వచ్చింది? న్యాయవాదిని నియమించుకొనే స్థోమత ఉందా లేదా అని ఖైదీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలువురు ఖైదీలు తాము ఎలాంటి తప్పు చేయకపోయినా ఉద్దేశపూర్వకంగా పలు కేసుల్లో పోలీసులు ఇరికించారని న్యాయమూర్తి ఎదుట వాపోయారు. కేసుల్లో బయట పడిన తరువాత కక్షల జోలికి వెళ్లకుండా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగించాలని సూచించారు. న్యాయవాదిని ఏర్పాటు చేసుకునే స్థోమత లేని వారు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది శ్రీనివాస్‌రెడ్డి, న్యాయవాదులు సుదర్శన్, నాగరాజురెడ్డి, వెంకటేష్, జైలు సూపరింటెండెంట్ అంజినాయక్, లోక్ అదాలత్ సిబ్బంది హేమావతి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి శ్రీధర్

ఆరోగ్యశ్రీ ద్వారా చికిత్సలు చేయిస్తాం

చిలమత్తూరు: స్థానిక పీహెచ్‌సీలో శనివారం మండలంలోని పలువురు ఫ్లోరోసిస్ బాధితులకు సహాయ పరికరాలను పంపిణీ చేశారు. ఇటీవల ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాల్లో అనుమానాస్పద కేసులను గుర్తించారు. వారి నుంచి మూత్ర, రక్తన మూనాలను సేకరించి జిల్లా కేంద్రానికి పంపి ఫ్లోరోసిస్ బాధితులను గుర్తించారు. వారికి అవసరమైన సహాయక చర్యల్లో భాగంగా బెల్టులు, వాకర్లు అందించినట్టు జిల్లా ఫ్లోరోసిస్ అధికారి ఆంజనేయులు తెలిపారు. బాధితులకు అవసరమైన శస్త్ర చికిత్సలు ఆరోగ్యశ్రీ ద్వారా చేయిస్తామన్నారు. ఫ్లోరైడ్ ఉన్న గ్రామాల్లో బాధితులకు స్వచ్ఛమైన నీటిని అందిస్తామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



ఫ్లోరోసిస్ బాధితులకు పరికరాలను పంపిణీ చేస్తున్న దృశ్యం

50 యూనిట్ల రక్తం సేకరణ



రక్షా అకాడమీలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

చిలమత్తూరు: ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, లింక్ వర్కర్ స్కీం ఆధ్వర్యంలో మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారి కొడికొండ చెక్‌పోస్టులో ఉన్న రక్షా అకాడమీలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. అకాడమీ సిబ్బందితో పాటు శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు రక్తదానం చేశారు. 50 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు వైద్యాధికారి డా.రామకృష్ణ తెలిపారు. కార్యక్రమంలో రక్షా అకాడమీ కల్నల్ కిరిత్ నాయర్, కమాండెంట్ నవీన్ త్యాగి, ఏజీఎం గోపకుమార్, నర్సింగ్ అధికారి నాగేశ్వర్ రెడ్డి, చైల్డ్ ఫండ్ ఇండియా జిల్లా రిసోర్స్ అధికారి రమేష్, జోనల్ సూపర్‌వైజర్ వెంకట్, బ్లడ్ స్టోరేజీ సెంటర్ ల్యాబ్ టెక్నీషియన్స్ నందకుమార్, సాహీరా బాను, లింక్ వర్కర్ హరి తదితరులు పాల్గొన్నారు.

సీకే పురం అధ్యక్షురాలిగా అరుంధతి



నూతన అధ్యక్షురాలిని అభినందిస్తున్న దృశ్యం

పావగడ: తాలూకాలోని చెన్నకేశవపురం గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా అరుంధతి ఎన్నికయ్యారు. పంచాయతీ కార్యాలయం మీటింగ్ హాలులో శనివారం జరిగిన ఎన్నికల్లో అరుంధతి, సన్న బొమ్మక్క మధ్య గట్టి పోటీ నెలకొంది. మొత్తం సభ్యులు 15 మంది ఉండగా ఇద్దరు సభ్యులు హాజరు కాక పోవడంతో అరుంధతి కి 8 ఓట్లు, సన్న బొమ్మక్కకు 5 ఓట్లు పడడంతో అరుంధతి ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, తహసీల్దార్ సంతోష్ కుమార్ అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా కొత్తూరు నాగేశ్, కొండప్ప, ఉపాధ్యక్షురాలు రాజమ్మ, పీడీఓ రంగస్వామి, రంగధామప్ప, దొడ్డరంగప్ప తదితరులు నూతన అధ్యక్షురాలిని ఘనంగా సన్మానించారు.

విద్యార్థులు ఉన్నతస్థాయికి ఎదగాలి

మడకశిరరూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు జమ్మానిపల్లి మూర్తి సూచించారు. గౌడనహళ్లి ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది టెన్త్‌లో ప్రథమ స్థానం మార్కులు సాధించిన విద్యార్థిని రమ్యకు శనివారం ఆయన రూ.3 వేల నగదు ప్రోత్సాహకాన్ని అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం ఉపాధ్యాయులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జంతువులను వధిస్తే చర్యలు

హిందూపురం: బక్రీద్ పండుగ సందర్భంగా నిబంధనలు ఉల్లంఘించి జంతువులను వధిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి ఒక ప్రకటనలో హెచ్చరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిబంధనలను అనుసరించి లైసెన్సు పొందిన జంతువధశాలలో మాత్రమే జంతువులను వధించాలని సూచించారు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

పెనుకొండ రూరల్: మండలంలోని మావటూరు పరిసర ప్రాంతాల్లో పేకాట స్థావరాలపై పెనుకొండ పోలీసులు శనివారం దాడి చేశారు. ఆరుగురు జూదరులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.8,960 నగదు, 52 పేక ముక్కలు స్వాధీనం చే సుకున్నారు. 14 ద్విచక్ర వాహనాలను సీజ్ చేసినట్లు ఎస్ఐ రాజేష్ తెలిపారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

అమరాపురం: స్థానిక ప్రాథమిక మెయిన్ పాఠశాలలో ఆదివారం ఆరోగ్య మైత్రి కూటమి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు కూటమి సభ్యుడు డాక్టర్ బసవరాజు తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శిబిరానికి కర్ణాటక రాష్ట్రం చిత్రదుర్గం నుంచి స్త్రీల వ్యాధి నిపుణులు జ్యోతివిజయ్‌కుమార్, పావగడ నుంచి సామాన్య వ్యాధి నిపుణులు ఓంకార్ నాయక్, హిందూపురం నుంచి కంటి వ్యాధి నిపుణులు జింకా కృష్ణమోహన్ హాజరవుతారన్నారు.

సంక్షిప్త సమాచారం

మీ సేవా కేంద్రాల తనిఖీ



గోరంట్లలోని మీ సేవా కేంద్రంలో సూచనలిస్తున్న నోడల్ ఆఫీసర్ శివారెడ్డి

గోరంట్ల: మండలంలోని బూదిలి, గోరంట్లలోని మీ సేవా కేంద్రాలను నోడల్ ఆఫీసర్ శివారెడ్డి శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా మీసేవ కేంద్రాల ద్వారా పౌరసేవలు అందుతున్న వివరాలు, ప్రభుత్వ నిబంధనల మేరకు సేవలకు తీసుకుంటున్న రుసుం తదితర వాటిపై వినియోగదారులతో ఆరాతీశారు. ప్రభుత్వ నిబంధనలు పాటించకపోతే సంబంధిత మీ సేవా నిర్వాహకులపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠ్యపుస్తకాల పంపిణీ

గుడిబండ: జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 2024–25 విద్యా సంవత్సరానికి విద్యార్థులకు పుస్తకాల పంపిణీ కార్యక్రమం శనివారం ప్రారంభించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంల పర్యవేక్షణలో ప్రజాప్రతిధులు పాఠ్యపుస్తకాలను అందజేశారు. 8వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, బెల్టులు, బ్యాగులు ఇతర సామగ్రిని విద్యార్థులకు పంపిణీ చేశారు. అన్ని తరగతులకు సంబంధించి 130 మంది విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేసినట్లు హెచ్ఎం గోవిందప్ప తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్సీ సభ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పనిముట్లు పంపిణీ చేయాలి

చిలమత్తూరు: ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని చాగలేరు పంచాయతీ పరిధిలోని నంజిరెడ్డిపల్లి, పెద్దరెడ్డిపల్లి, చాగలేరు తదితర ప్రాంతాల్లో ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి మాట్లాడారు. 100 రోజుల ఉపాధి పనులు పూర్తి చేసుకున్న వారికి పనిముట్లు మాత్రం ఇవ్వడం లేదన్నారు. నాలుగు వారాలుగా బిల్లులు పెండింగ్ లో ఉండటంతో కూలీలు అవస్థలు పడుతున్నారన్నారు. నాలుగు మైళ్ల దూరం నడిచి కూలీ పనులకు వెళుతున్నారని తెలిపారు. వారికి కనీసం రవాణా ఖర్చులు కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఉపాధి బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

నిందితులను అరెస్ట్ చేయాలి

హిందూపురం టౌన్: పట్టణానికి చెందిన యువ న్యాయవాది, ఎస్ఎస్‌యూఐ జాతీయ కార్యదర్శి సంపత్ కుమార్ హత్య కేసులో ప్రధాన నిందితులను అరెస్ట్ చేయాలని రాజకీయ పార్టీల ఐక్యవేదిక, విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. హత్య రాజకీయాలు, దాడులు, దౌర్జన్యాలను అరికట్టాలని కోరుతూ సీనియర్ అసిస్టెంట్ గురుస్వామికి వినతిపత్రం అందజేశారు. యువ న్యాయవాది సంపత్‌ను అతి కిరాతకంగా హత్య చేయడం చూస్తుంటే ప్రభుత్వ యంత్రాంగంపై ప్రజలు నమ్మకం కోల్పోవాల్సి వస్తోందన్నారు. సంపత్ కుటుంబానికి రూ.కోటి నష్టపరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్యామ్ కిరణ్, బీఎస్పీ శ్రీరాములు, ఆర్‌ఎస్పీ పార్టీ శ్రీనివాసులు, సీపీఎం రమణ, ఎంఐఎం మున్నా, దళిత సమైక్య నాయకులు నారాయణ, పార్టీల నాయకులు కలీం, హనుమంతరాయుడు, నూరుల్లా, హరి కుమార్, ఈశ్వర్, వెంకటేశులు, శ్రీరాములు, నరసింహులు, ఎంఎల్ నారాయణప్ప, ఎస్ఎఫ్ఐ బాబావలి, వీరేష్, నాగార్జున, కేవీపీఎస్ నాయకులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



సంపత్ హత్య కేసులో నిందితులను అరెస్ట్ చేయాలని వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నీలం రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివి

పెనుకొండ: డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి సేవలు మరువలేనివని అధ్యాపకులు కొనియాడారు. శనివారం పట్టణంలోని స్థానిక పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి గతేడాది గుండెపోటుతో మరణించారు. ఏడాది పూర్తయిన సందర్భంగా కళాశాలలో అధ్యాపకులు, విద్యార్థులు ఆయన చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయప్ప, ప్రతాప్, హరీష్, బాబు, రామన్న తదితరులు మాట్లాడుతూ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి కళాశాల అభ్యున్నతికి రమేష్‌రెడ్డి ఎంతో పాటుపడ్డారన్నారు. దివంగత ప్రిన్సిపాల్ స్మారకార్థం అధ్యాపకులు, విద్యార్థులు మొక్కలు నాటారు.

నాగలమడకలో మెగా వైద్య శిబిరం

పావగడ: తాలూకాలోని నాగలమడక సుబ్రహ్మణ్యం స్వామి ఆలయం ఆవరణలో అర్చకుడు విశ్వనాథశాస్త్రి జ్ఞాపకార్థం బెంగుళూరుకు చెందిన సప్తగిరి ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి జనం పోటెత్తారు. ఈ సందర్భంగా గుండె, నరాలు, మూత్ర పిండం , క్యాన్సర్ తదితర సాధారణ జబ్బులకు సంబంధించి వైద్యులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి చికిత్స అందించారు. అదే విధంగా ఉచితంగా ఔషధాలు అందించారు. నిర్వాహకులు కృష్ణశాస్త్రి, జయవర్ధన్, ఆలూరు శేఖర్, బదరీ నాథ్ రోగులకు సేవలందించారు.